# కొడవటిగం
# కుటుంబరా

## ఒక అనార్య గాథ



149.7
KUT

149 7
KUJ
N-11888
AUTHOR
TITLE

Dr. B. R. AMBEDKAR
OPEN UNIVERSITY
LIBRARY
HYDERABAD-500 033

ఒక అనార్య గాథ
AOUA105B128
3
→ కుటుంబరావు

# ఒక అనార్య గాథ

[కథా సరిత్సాగరంలో అనేక వింత కథలున్నాయి. వాటిలో మరింక వింతకథ సూర్యప్రభుడి కథ. ఇది ఒక అనార్య పురాణం. మనం చదివే పురాణాలన్నీ సాధారణంగా దేవతలకు అనుకూలంగా రాసినవి. ఈ దేవదానవులు ఏనాటివాళ్ళోగాని మన జాతి ఈనాటికీ వారిమధ్య తటస్థభావాన్ని తెచ్చుకోలేదు. మనం యింకా దేవతల పక్షమే! ఇందుకు కారణం మనకు తెలిసిన పురాణాలన్నీ దేవతల పక్షం అయి వుండటమే కాని ఈ సూర్యప్రభుడికథ దానవుల పక్షాన రాసినది.

మనం దేవతల పక్షంమాని దానవుల పక్షం కావాలన్న ఉద్దేశంతో యీ వ్యాసం రాయటంలేదు. మామూలు పురాణాలలోవుండే అభూతకల్పనలు కొన్ని యీ పురాణంలోకూడా వున్నాయి. అందుచేత ఆ పురాణాలను నమ్మటం మానేసి దీన్నే నమ్ముదాం అన్న ప్రశ్న లేనేలేదు. మరి ఈ కథ మనకెందుకు? చెబుతాను.

మనకు మానవచరిత్ర అవగాహనలేని కాలంలో రెండురకాల
వై ఖరిమాత్ర ... మూ, లేదా,
వాటిని పూ ... త్తలు యీ
ప్రాచీన రచ ... కొంత వెలికి
తీయసాగారు ... ంది. ఉదా
హరణకు బు ... ట. ఒకటి
హరియూపి ... నార్మిణీ–ఇది
పరశురామ ... బయటపడిన
హరప్పా న ... . నార్మిణీ
మొహంజొ ...

అలాగే దృష్టాంతాలనుబట్టి మన పూర్వపు ఋషులపేర్లు ఆదిమ

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N11888

జాతులను సూచిస్తాయని తెలుసుకొనగలుగుతున్నాం. ఆ పేరు కుక్కలకూ, ఎద్దులకూ, చిలకలకూ, తాబేళ్ళకూ, ఏనుగులకూ, పుట్టలకూ, పక్షులకూ సంకేతాలు.

అదేవిధంగా, మన ప్రాచీన సాహిత్యాన్ని ఎలా చదవాలో కూడా మనం ఊహించగలుగుతున్నాం. ఆదిమ జాతులవాళ్ళు అరణ్యమృగాలను జడల ఏనుగులూ, ఎనుములూ మొదలయినవాటిని వేటాడి వాటి తోళ్ళు కట్టుకున్నట్టు మనకు తెలుసు. ఇవన్నీ మన ప్రాచీనసాహిత్యంలో రాక్షసులయ్యాయి, గజాసురుడూ, మహిషాసురుడూ వగయిరా. శివుడు గజచర్మాంబరధారి. ఇంతకన్న చిత్రమేమిటంటే ఇంద్రుడు నిర్మూలించిన వృత్రాసురుడు. వీడు నదిమీది ఆనకట్ట! ఆర్యులు రావటానికి పూర్వం సింధూలోయలో నివసించినవాళ్ళు నదులకు ఆనకట్టలు కట్టి, ఎడారిలో వరదలు తెప్పించి, వరద తీశాక అక్కడ పైర్లు పండించారు. ఇంద్రుడు తన వజ్రాయుధం (దధీచి వెన్నెముక!)తో ఆ ఆనకట్టలను ఛేదించి నీటిని విడుదలచేశాడు!

ఇలాంటి విషయాలు మన ప్రాచీన సాహిత్యంనుంచి వేల సంఖ్యలో బయటపడుతున్నాయి. అందుచేత మనం ఈనాడు యీ ప్రాచీన సాహిత్యాన్ని చెత్తకుప్పలో పారెయ్యనూ అక్కర్లేదు. దేవుడి పెట్టెలో పెట్టి పూజించనూ అక్కర్లేదు. (నిజానికి రెండూ ఒకటే)

ఇంతకూ ఈ సూర్యప్రభుడి కథలో నాకు కొన్ని ఆసక్తిదాయకమైన విషయాలు కనిపించాయి. వాటిని చెప్పటానికే యీ వ్యాసం. నాకన్నా శాస్త్ర పరిజ్ఞానంగలవారికి యీ కథలో యింకా అనేక విషయాలు కనిపించవచ్చు. అది పరిశోధకులు చూసుకోవాలి.

స్థూలంగా మానవ పరిణామం ఎలా జరిగిందంటే, వారి ఆర్థిక జీవనం రెండు రకాలుగా చీలింది. ఆహారం ఏరుకొనటమూ, మృగాలను వేటాడటమూ అన్నదశను దాటగానే కొన్ని జాతులవారు పశువులను మచ్చికచేసి, పశుసంపద ఆధారంగా జీవించారు. మరికొన్ని జాతులవాళ్ళు వ్యవసాయం ప్రధానంగా జీవించారు. ఇది రెండురకాల సామాజిక వ్యవస్థలకు దారితీసింది.

అయినా రెండురకాల వ్యవస్థలూ భౌతిక వాదాన్నే అవలంబించాయి. అయితే వర్గవిభజన ఏర్పడి మార్క్సిస్టులు చెప్పే "సామాజిక దోపిడీ" ఆరంభంకాగానే ఆధ్యాత్మిక దృక్పథం ఒకటి తలయెత్తింది. మతాలు విజృంభించాయి.

మనదేశంలో లోకాయతనమూ, వేదాయతనమూ అన్నవి వ్యాప్తి చెందాయి. ఒకటి భౌతికవాదంతోను, రెండోది ఆధ్యాత్మిక వాదంతోనూ కూడినయి. లోకాయతనంలో చేరేవి ప్రధాన (ప్రకృతి) వాదమూ, స్వభావ (పరిణామ) వాదమూ, సాంఖ్యమూ, యోగమూ వగైరా వగైరా. ఆధ్యాత్మికవాదులు లోకాయతనాన్ని నాస్తికవాదమన్నారు. ఒకవంక సాంఖ్యలోకీ యోగంలోకీ పరమాత్మను దొడ్డిదారిన ప్రవేశపెట్టుతూనే వాటిని తీవ్రంగా ఖండించారు. భౌతికవాదు లను చార్వాకులనీ, తాంత్రిక వాదాన్ని వామాచారమనీ గర్హించారు.

ఆధ్యాత్మికవాదులచేత ఎన్నితిట్లు తిన్నా, ఆ ఆధ్యాత్మిక వాదులు ఈశ్వరసత్యం, జగన్మిధ్యా అంటూంటే, ప్రకృతి-పరిణామవాదులయిన భౌతికవాదులు మన ప్రాచీనశాస్త్రాలకు పునాదులు వేశారు. వైద్య, గణిత, రసాయనశాస్త్రాలు ఈ వాదంనుంచే పుట్టాయి. అందుచేత ఈనాటి శాస్త్రవేత్తలకు నిజమైన పూర్వులు యీ భౌతికవాదులే. సూర్యప్రభుడి కథ. అటువంటి భౌతికవాదావలంబకులయిన దానవులకుచెందినది. ఇందులో వారి విశ్వాసాలూ, దృక్పథమూ గురించి కొంత మనకు తెలుస్తుంది.]

మద్ర దేశంలో శాకల పురానికి అంగారప్రభుడు రాజుగా ఉండేవాడు. అతడి కొడుకు చంద్రప్రభుడు. ఆ చంద్రప్రభుడికి సూర్య ప్రభుడనే కొడుకు కలిగాడు. వారంతా శివారాధకులు. సూర్యప్రభుడు విద్యాధర చక్రవర్తి అవుతాడని శివుడు ఆశీర్వదించి, కావాలని ఆదేశించాడు.

సూర్యప్రభుడికి పదహారేళ్ళు నిండి యువరాజుగా అభిషేకం పొందగా, మయుడు వచ్చి, విద్యాధర చక్రవర్తికి అవసరమైన విద్యలు నేర్పుతానని తీసుకుపోయాడు. (విద్యలూ, విద్యాధరులూ అనేమాటలు అనార్యులకే వర్తిస్తాయనుకుంటున్నాను) సూర్యప్రభుడు మయుడనుంచి

విమానాలు తయారుచేయటం మొదలుకుని అనేక విద్యలు నేర్చుకున్నాడు. అతను 'భూతాపనం' అనే విమానాన్ని తయారుచేసుకుని దానిమీద ఎక్కడబడితే అక్కడికి పోతూ, తనను వలచిన అనేకమంది రాజకుమార్తెలను ఎత్తుకువచ్చి, దరిమిలా వారిని పెళ్ళాడాడు. వారిలో తామ్రలిప్తి, పశ్చిమదేశమూ, కంచీ, చీవా, శ్రీకంఠదేశమూ, కౌశాంబీ మొదలైన చోట్లకు చెందిన రాజకుమార్తెలు ఉన్నారు.

ఒకనాడు మయుడు చంద్రప్రభుడి సభకువచ్చి శ్రుతశర్మతో యుద్ధానికి బయలుదేరే తరుణం వచ్చిందన్నాడు. శ్రుతశర్మ అనేవాడు ప్రస్తుతం విద్యాధర చక్రవర్తిగా ఉంటున్నవాడు.

మయుడు అక్కడ ఉండగానే నారదుడు ఇంద్రుడి వద్దనుంచి చంద్రప్రభుడికి సందేశం తెచ్చాడు: అది ఇలా ఉన్నది:

"మీరు శివుడి ఆదేశంపై మయుడి సహాయంతో ఒక మర్త్యుణ్ణి విద్యాధర చక్రవర్తి చెయ్యాలని చూస్తున్న సంగతి నే నెరుగుదును. మీరు ఈ పని చేయరాదు. నేనా పదవిని శ్రుతశర్మకు ఇచ్చాను. అతను విద్యాధరుడు అంతేగాక ఆ పదవికి వారసుడు. రుద్రయజ్ఞం చేసేముందు అశ్వమేధం చెయ్యవలసిందిగా నేను నీకు సలహా ఇచ్చాను. కాని నా సలహాను నువు పాటించలేదు. దేవతలను తృణీకరించి రుద్రుణ్ణి నమ్ముకోవటం నీకు క్షేమంకాదు."

[రుద్రుడు (శివుడు) అనార్యుల ఆరాధ్య దైవమని ఈ సందేశం స్పష్టం చేస్తుంది. జీవితంలో ఎన్నో మార్పులు జరిగాకనే శివుణ్ణి త్రిమూర్తులలో ఒకణ్ణిచేసి, అప్పటికీ అతణ్ణి లయకారకుణ్ని చేసి, శివభక్తులను అతడే నిర్మూలించినట్టుకూడా పురాణాలు సృష్టించారు.]

ఇంద్రుడి సందేశానికి మయుడు ఇలా సమాధాన మిచ్చాడు.

"ఇంద్రుడు పొరబడ్డాడు. సూర్యప్రభుడు మర్త్యుడని ఆయన అంటున్నాడు. అందువల్ల లోటేమిటి? అన్ని సిద్ధులూ మానవులకే ఉన్నాయి. వారు సత్త్వవంతులు. (తంత్రశాస్త్రం ఇదే చెబుతుంది) శ్రుతశర్మకు తాను విద్యాధర చక్రవర్తి పదవి ఇచ్చాననటంకూడా

సబబుకాదు. మహేశ్వరుడు దాత అయిఉన్నచోట ఇతరు లెవరికీ ఇచ్చే అధికారంలేదు. హిరణ్యాక్షుడికి ఇంద్ర పదవి రావలసిఉండెను. కాని అతన్ని తోసిపుచ్చారు. (ఈ మాట ఆర్యపురాణాలలో ఎక్కడా లేదు.) ఇంద్రుడు మాది అధర్మం అనటం సరికాదు. మేము శత్రువును జయించ బోతున్నామేగాని ఒక మునిపత్నిని కాజేయబోవటంలేదు. బ్రాహ్మణ్ణి హత్య చేయబోవటంలేదు. (ఇంద్రుడు పైన విసురు) మా అధర్మం ఎందులో ఉంది. రుద్రయజ్ఞం చేసినాక మరే యజ్ఞమూ చేయనవసరం లేదు. (అశ్వమేధం ఆర్యులకు ప్రధానమైనది) మహేశ్వరుణ్ని పూజించి నాక ఇతరదేవతలను గురించి మేమెందుకు చింతించాలి. దయచేసి ఈ మాటలు ఇంద్రుడికి చెప్పు. మేము మా ప్రయత్నం మానేదిలేదు. ఇంద్రుడు తనకు చేతనైనది చేసుకోనీ."

నారదుడు వెళ్ళిపోయాడు. మయుడు చంద్రప్రభుడితో, "ఇంద్రుడి విషయమై దిగులువద్దు. అతను తన బలాలను శ్రుతశర్మ బలాలతో కలుపుతాడు. అంతమాత్రాన ప్రహ్లాదుడి నాయకత్వం గల మనకు భయం లేదు. దైత్యులూ, దానవులు యావన్మందీ మనపక్షాన పోరాడతారు. ఈశ్వరుడు మనపక్షాన ఉండగా మూడులోకాలూ ఏకమైనా మనని ఏమీ చేయలేరు. యుద్ధయత్నాలు చెయ్యి" అన్నాడు.

ఆ రాత్రి చంద్రప్రభుడు శివుడికి మహాబలి ఇచ్చాడు. నంది శివుడివద్దనుంచి ఇలా సందేశం తెచ్చాడు. "నూరుమంది ఇంద్రులకు కూడా వెరవ పనిలేదు. సూర్యప్రభుడు విద్యాధర చక్రవర్తి అయి తీరుతాడు."

[ఈ కథలోవచ్చే ప్రహ్లాదుడు భాగవతంలో ఉన్న ప్రహ్లాదుడు కాడు. ఇతను సిసలైన దానవుడు, దేవతలకు విరోధి. ప్రహ్లాదుడు హరి భక్తుడుగా చిత్రించటానికి ఆధారమేదీ ఉన్నట్టు కనబడదు. భాగవతంలోని ప్రహ్లాదుడితోబాటు అతనితండ్రి హిరణ్య కశిపుడుకూడా అభూత కల్పన లాగే కనబడుతుంది. ఈ కథలో హిరణ్యాక్షుడి ప్రస్తావన ఉన్నదిగాని, హిరణ్య కశిపుడి ఊసులేదు. లీలావతి ఉన్నదిగాని ఆమె హిరణ్య కశిపుడి భార్యకాదు — మయుడి భార్య!]

మర్నాడు ఉదయం మయుడు చంద్రప్రభుడికి ఒక రహస్యం చెప్పాడు.

"కిందటి జన్మలో నువ్వు నా కొడుకువు. సునాధుడు అనేవాడివి. మహా శక్తిమంతుడివి. నీ తమ్ముడు సుముండీకుడు. ఇప్పుడు నీ కొడుకు సూర్యప్రభుడు, మీ రిద్దరూ దేవతలతో యుద్ధం చేస్తూ మరణించి, ఇక్కడ తండ్రి కొడుకులుగా పుట్టారు. శాస్త్రాన్నీ, యోగాన్నీ అనుసరించి మేము నీ కళేబరాన్ని తైలంలో జాగ్రత్తచేసి ఉంచాం. నువ్వు ఇప్పుడు పాతాళానికివచ్చి యుక్తిచేత నీ పాత శరీరంలోకి ప్రవేశించవచ్చు. నేను చెబుతున్నాను. ఆ శరీరంతో నువ్వు బల తేజస్సులు తిరిగి పొంది దేవతలతో యుద్ధం చేయగలవు. కాని సూర్యప్రభుడు మటుకు ఇప్పుడున్న శరీరంతోనే విద్యాధర చక్రవర్తి అవుతాడు."

[పై మాటలలో అనేక విషయాలు కన్పిస్తాయి. శాస్త్రానికీ, యోగానికీగల సంబంధం ఒకటి స్పష్టంగా కనిపిస్తుంది. ఒక మనిషి "యుక్తి" చేత మరొక శరీరంలో ప్రవేశించవచ్చునంటాడు మయుడు. ఇది ఒక తాంత్రిక-యోగిక ప్రక్రియ అనుకోవాలి. పరకాయ ప్రవేశ విద్య అనేది కథలలో మనం చదువుతామేగాని అది సాధ్యమని తాంత్రికులూ, యోగులూ నమ్మి ఉండాలి. ఇలాంటి విద్యలు (మాయలు) రాక్షసులకే ఎక్కువగా తెలిసినట్టు అనుకోవడానికి పురాణాలు కూడా అవకాశం కలిగిస్తున్నాయి. మృతసంజీవనీ విద్య దానవులకు గురువైన శుక్రాచార్యులకి తెలుసునని. దానిని నేర్చుకు రమ్మని కచుణ్ని దేవతలు పంపారనీ పురాణాలలో ఉన్నది. రాక్షస మాయలను గురించి మనం ప్రతి పురాణ కథలోనూ చదువుతాం. ప్రముఖుల శవాలను చెడిపోకుండా దాచి ఉంచటమన్నది ఈజిప్టులో వుండిన సంగతి మనకు తెలుసు. మరి ప్రాచీన ఈజిప్టునులకు పునర్జన్మలోనూ, పరకాయ ప్రవేశంలోనూ నమ్మకం ఉండేదో లేదో నాకు తెలీదు. కానీ ఆ చచ్చినవాళ్ళు మళ్ళీ ఎలాగో పునర్జీవితు లవుతారని నమ్మినందుచేతనే వాళ్ళు ఆ శవాలను భద్రపరచి ఉండవచ్చు. ఈ కథలోనైనా సునాధుడి శవాన్నే భద్రపరిచి, అతను

తిరిగి బతకటానికి దానవులు అవకాశం కలిగించినారు గాని, అతని తమ్ముడైన సుముండీకుడి శవాన్నిగాని, ఇతర రాక్షసుల శవాలను గాని దాచటం జరగలేదు. అందుకే సూర్యప్రభుడికి తనపూర్వ శరీరంలో ప్రవేశించే అవకాశం లేదు.]

చంద్రప్రభుడు తన పూర్వదానవ శరీరంలో ప్రవేశించాలని మయుడు సూచించేసరికి, చంద్రప్రభుడి అనుచరులు అభ్యంతరం చెప్పి "మా ప్రభువు మరొక శరీరంలో ప్రవేశిస్తే ఆయన చచ్చిపోయిన వాడికిందనే లెక్క. ఆయనకు మేము జ్ఞాపకం ఉండము. అందువల్ల మా కేమి లాభం" అన్నారు.

దానికి మయుడు ఇలా సమాధానం చెప్పాడు.

"బుద్ధి పూర్వకంగానూ, యోగం ద్వారానూ పరకాయ ప్రవేశం చేసినవాడు ఏదీ మరవడు. మరొక వేదనపడి చనిపోయి మరొక గర్భంలో జన్మించిన వారికే విస్మృతి. ఒక ఇంటినుంచి మరొక ఇంట ప్రవేశించే వాడిలాగా యోగి అయినవాడు ఎన్ని శరీరాలలోనైనా ప్రవేశించగలడు. మీరంతా కూడా పూర్వజన్మలో దానవులే. రసాతలానికి వచ్చి, అమృతం తాగి, రుగ్మతలనుంచి విముక్తులు కండి."

[యోగికి పరకాయ ప్రవేశంచేసినా విస్మృతి ఉండదన్న విశ్వాసం యోగసిద్ధాంతానికి సంబంధించినది అయిఉండాలి. కాని ఈ విశ్వాసం నిజమైన దైతే స్మృతి అన్నది కేవలమూ మెదడుకు సంబంధించినది కాదా అన్న సమస్య వస్తుంది. ఇది చాలా లోతైన సమస్య. ఒక శరీరం నుంచి ఇంకో శరీర్ంలోకి ప్రవేశించేది ఏమిటి అన్న సమస్యకూడా వస్తుంది. ఇదికూడా లోతు సమస్య. పోతే అమృతం రాక్షసుల ఆధీనంలో ఉన్నదనేది ఆర్య పురాణాలలో కానరాదు. అది ఈ కథలో మాత్రమే ఉన్నది.]

మర్నాడు మయుడివెంట చంద్రప్రభుడు సపరివారంగా ఇరావతి, చంద్రభాగాలు కలిసే చోటికి వెళ్ళాడు. [ఇరావతి అంటే రావీనది. ఈ పేరు బర్మాలో ఉండే నదికి ఎప్పుడో మారింది. చంద్రభాగ అంటే ఈ

నాటి చీనాబ్ నది. ఈ రెండు నదులూ కలిసేచోటు అంటే సింధులోయ నాగరికత వెలిగిన ప్రాంతం. మయుడు వీరందరినీ హరప్పా నగర ప్రాంతానికి చేర్చటం గమనించ దగినది.]

అక్కడ మయుడు వారికి నీటిలో ఒక బిలం చూపాడు. అందరూ ఆ బిలంలో ప్రవేశించి చాలా దూరం నడిచి, ఒక గొప్ప ఆలయాన్ని చేరుకుని అందులో ప్రవేశించారు. [ప్రాచీన ఆర్యులు ఆలయాలెరుగరు.]

ఆ ఆలయం లోపల మయుడు చంద్రప్రభుడికి పరకాయ ప్రవేశము చెయ్యటానికి అవసరమైన యోగ రహస్యాలూ, సాంఖ్య రహస్యాలూ చెప్పాడు. (రెంటికీగల సంబంధాన్ని నిరూపించటానికి మన పరిశోధకులు పేజీలకు పేజీలు రాశారు. కాని ఇక్కడ యోగమూ, సాంఖ్యమూ జోడించిచెప్పి ఉన్నాయి.) తరువాత మయుడు. "అష్టసిద్ధులకూ విమోచనానికీ మూలమైన రహస్యం ఇదే" అన్నాడు. (విమోచనం, స్వేచ్ఛ, లేక మోక్షం శరీరానికి మాత్రమే సంబంధించి ఉంటుందని యోగం చెబుతుంది. బ్రహ్మ, మాయా, మోక్షమూ, పురుషుడూ లాంటి పదజాలానికి వేదాంతులు కొత్త అర్థాలు కల్పించి, అధ్యాత్మిక వాదంలో చేర్చుకున్నారన్నది రుజువైన సత్యం.)

ఈ సందర్భంలో మయుడు మరికొన్ని విషయాలు స్పష్టం చేశాడు. మహనీయులు ఈ సిద్ధులకోసమే, ఈ విమోచనం కోసమే జపం చేస్తారు. వాళ్ళు స్వర్గాన్నీ, మోక్షాన్నీ కోరరు. ఈ సందర్భంలో మయుడు ఒక కథకూడా చెప్పాడు.

పుష్కరద్వీపంలో ఒక బ్రాహ్మణుడు రెండువందల ఏళ్ళు జపం చేశాడట. అతని శిరస్సునుంచి గొప్పజ్వాల వెలువడిందట. బ్రహ్మ మొదలుగాగల దేవతలు వరాలిస్తామని అతని వద్దకు వచ్చారట. జపం తప్ప తనకు మరేకోరికా లేదని ఆ బ్రాహ్మణుడు అన్నాడట. అప్పుడతన్ని హిమాలయాలకు ఉత్తరంగా వెళ్ళి జపం చేసుకోమన్నారట. అక్కడికిపోయి అతను జపం చేసుకుంటూ ఉంటే దుర్భరమైన వేడి పుట్టుకొచ్చిందట. అతని జపం మాన్పించటానికి ఇంద్రుడు అతనివద్దకు

అప్సరసను పంపాడట. కాని ఆ ప్రయత్నం విఫల మయిందట. అప్పుడు దేవతలు అతనివద్దకు మృత్యువును పంపారట. మృత్యువు అతనివద్దకు వచ్చి, "మర్త్యుడెవడూ ఇంతకాలం జీవించి వుండరాదు. నా వెంట రా" అన్నాడట. అప్పుడు ఆ బ్రాహ్మడు నేనై ప్రాణత్యాగం చెయ్యను. నా ఆయుర్దాయం ముగిస్తే నీవే నన్ను ఎందుకు తీసుకుపోవు? అన్నాడట. మృత్యువు జడిసి వెళ్ళిపోయాడట. తరువాత ఇంద్రుడు వచ్చి ఆ బ్రాహ్మణ్ణి అమాంతంగా స్వర్గానికి తీసుకుపోయాడట. కాని అతను స్వర్గంలో కూడా జపం మానాడుకాడట. ప్రాణంవిసిగి ఇంద్రుడు అతన్ని మళ్ళీ భూమికి తెచ్చి విడిచి పెట్టాడట. కథ ఇలా సాగిపోతుంది.

(ఈ కథలో వాస్తవికత ఏమీలేకపోయినా దేవదానవ జీవిత దృక్పథాల మధ్య వ్యత్యాసం బాగా కనపడుతుంది. సాధారణంగా భౌతికవాదం కోరికలతో కూడుకున్నదనీ, ఆధ్యాత్మికవాదం బ్రహ్మ పదార్థాన్నిచూపేదనీ "మన బ్రాహ్మణ సాహిత్యం" చెబుతుంది. ఇక్కడ మనకు కనిపించేది దానికి పూర్తిగా విరుద్ధం. బ్రహ్మ కోరికలు తీర్చుతానంటాడు. ఇంద్రుడు అప్సరసలను పంపుతాడు – అతడికి అలాంటి తార్పుడు పరిపాటే. అంతటితో ఊరుకోక స్వర్గసుఖాలనే ఎదట పెడతాడు. వాటికీ వేటికీ చలించని బ్రాహ్మడు జీవితానికి జలగలాగా అంటుకుని కూడా జపం చేస్తాడు. అతనికి కావలసినవి సిద్ధులు!)

దేవాలయంనుంచి మయుడువారందరినీ రెండోపాతాళానికి తీసుకుపోయాడు. అక్కడ చంద్రప్రభుడు కిందటి జన్మలో తన శవాన్ని చూశాడు. అదే సునాథుడి శవం. సునాథుడు భయంకరాకారుడు. అతని శవంచుట్టూ కొందరు స్త్రీలు నిలబడివున్నారు, వారంతా సునాథుడి భార్యలు. మయుడు చంద్రప్రభుణ్ణి ఆ శవంలోకి ప్రవేశించ మన్నాడు. చంద్రప్రభుడు అలాగే చేసేసరికి, సునాథుడు తిరిగి బతికి, ఆవలించి, కళ్ళు తెరిచి, లేచికూర్చున్నాడు.

"మన భర్త తిరిగి బతికాడు!" అని దైత్య స్త్రీలు హర్షించారు.

చంద్రప్రభుడి పరివారంలో వాళ్ళు తన రాజు శరీరం నిర్జీవంగా ఉండటంచూసి ఏడ్చారు. వారితోపాడు సూర్యప్రభుడుకూడా ఏడ్చాడు.

సునాధుడు తన తండ్రి అయిన మయుణ్ని గుర్తించి, అతని పాదాలకు నమస్కారం చేశాడు.

"నీకు రెండుజన్మలూ జ్ఞాపకం ఉన్నాయా?" అని మయుడు అడిగితే సునాధుడు జ్ఞాపకం ఉన్నాయన్నాడు. సునాధుడు తమ్మందర్నీ గుర్తించిన మీదట సూర్యప్రభుడు మొదలైన వాళ్ళు సంతోషించారు.

మయుడు చంద్రప్రభుడి శరీరాన్ని తైలాదులతో భద్రపరిచాడు.

తరువాత మయుడు అందరినీ సువర్ణమయమూ, రత్నఖచితమూ అయిన భవనానికి తీసుకుపోయాడు. అక్కడ ఒక గుంటలో పానీయం (అమృతం) ఉన్నది. అందరూ దానిచుట్టూ కూర్చొని, అందులోనుంచి తాగారు. అందరికీ వెంటనే కొత్త వికాసంవచ్చి, నిద్రావస్థనుంచి జాగృతి పొందిన వారిలాగా అయారు.

మయుడు సునాధుణ్ని వెంటబెట్టుకొని నాలుగో పాతాళానికి వెళ్ళాడు. అక్కడ సునాధుడి తల్లి లీలావతి ఉన్నది. ఆమె అందం అప్సరసలను మించినదిగా చెప్పబడింది. నాలుగో పాతాళం అత్యంత మనోహరమైనదిగా వర్ణించబడింది. ఆమె సునాధుణ్ని ఆలింగనం చేసుకుని, తన రెండో కుమారుడు తిరిగి మరోజన్మ ఎత్తిన సూర్యప్రభుడుగా పరిచయం చేసుకున్నది.

తరువాత మయుడు తన కూతురైన మండోదరినీ, విభీషణుణ్ణీ స్మరించేసరికి, వారిద్దరూ వచ్చారు. (ఈ కథలో రావణ కుంభకర్ణుల ప్రసక్తిలేదు. మండోదరి విభీషణుడి భార్యలాగా కనబడుతుంది.)

విభీషణుడు మయుడితో "ఇప్పుడు దానవులలో నువ్వే ప్రముఖుడివి. దేవతలతో వైరం పెట్టుకోకు. అది మీకు నాశన హేతువవుతుంది. లాభించదు. దేవదానవ యుద్ధాలలో ఎప్పుడూ దానవులకే నాశనం కలిగింది, దేవతలకు కాదు" అన్నాడు.

(విభీషణుడు రామాయణంలోకూడా తన వారితో కలవడు. ఈ

కథలోకూడా అతను దేవతల పక్షపాతం వహించటమేగాక, దానవుల నాశనం తనది కాదన్నట్టు మాట్లాడతాడు.)

విభీషణుడన్న ఈ మాటకు మయుడు, "మేమై దేవతలతో తగాదా పెట్టుకోవటం లేదు. కాని ఇంద్రుడు మూర్ఖిస్తే ఏం చెయ్యగలం? ప్రమత్తులైన అసురులు మాత్రమే దేవతల చేతిలో చచ్చారు. బలిలాటి అప్రమత్తులు చావలేదు" అన్నాడు.

విభీషణుడు మండోదరితోసహా తిరిగి వెళ్ళిపోయాడు.

తరువాత అందరూ మూడో పాతాళంలో ఉన్న బలిని చూడ బోయారు. బలిది మహా గొప్ప వైభవం. ఆయన చుట్టూ దైత్యదానవులు పరివేష్ఠించి ఉన్నారు. అందరూ బలికి నరదానం చేసిన మీదట మయుడు బలికి పరిస్థితి అంతా వివరించి చెప్పాడు. బలి ప్రహ్లాదుణ్ణీ, ఇతర దానవ ప్రముఖులనూ పిలిపించి, సునాథుడు చంద్రభుడుగా జన్మించాడనీ, అతని కొడుకు సూర్యప్రభుడు విద్యాధర చక్రవర్తి కానున్నాడని తెలిపాడు.

"ధర్మమూ, సత్యమూ ఆచరించినంత కాలం అభ్యుదయం జరిగి తీరుతుంది" అని శుక్రాచార్యుడు అన్నాడు. (ఈ రెంటిలోనూ దేవతలకు విశ్వాసంలేదని ఆయన అభిప్రాయంగా కనబడుతుంది. అందుకు నిదర్శనాలు ఈ కథలోనే ఉన్నాయి.)

బలి ఉన్నచోటికి సప్తపాతాళాల పాలకులూ వచ్చి ఉన్నారు. బలి సూచించినమీదట సునాథుడు పునరుజ్జీవితు డయినందుకు వారు వేడుక చేసుకున్నారు.

ఇంతలో నారదుడు వచ్చి, అతిథి సత్కారాలు పొంది, ఇలా అన్నాడు.

"ఇంద్రుడు నన్ను పంపాడు. సునాథుడు తిరిగి బతికినందుకు ఆయన చాలా సంతోషంగా ఉన్నాడు. ఆయన మిమ్మల్ని తగాదా పెట్టుకో వద్దనీ, తన రక్షణలో ఉన్న శ్రుతశర్మను ద్వేషించవద్దనీ చెప్పమన్నాడు."

ప్రహ్లాదుడు దానికి సమాధానంగా ఇలా అన్నాడు.

"సునాథుడు తిరిగి బతికినందుకు ఇంద్రుడు ఎందుకు సంతోషించ

కూడదు? మే మెప్పుడూ గిల్లికజ్జాలు పెట్టుకోము. ఇందులోనూ తప్పు ఏమున్నది? సూర్యప్రభుడు విద్యాధర చక్రవర్తి కావాలని ఈశ్వరుడు అనుగ్రహించాడు. తనకు బలవంతుడి అండ ఉన్నదిగదా అని శ్రుతశర్మే మాతో తగాదా పెట్టుకుంటున్నాడు. ఈశ్వరాజ్ఞకు వ్యతిరేకంగా వెళ్ళటానికి మేము ఎవరం? ఇంద్రుడు చెప్పేమాటఅసందర్భంగాఉన్నది."

నారదుడు ప్రహ్లాదుడి మాటకు సమ్మతించి, ఇంద్రుణ్ని తిట్టి వెళ్ళిపోయాడు.

శుక్రుడు దానవరాజులతో, 'ఈ విషయంలో ఇంద్రుడు మనకు బద్ధశత్రువు. మనకు మహేశ్వరుడు అనుకూలుడై ఉండగా ఇంద్రుడు ఏం చెయ్యగలడు? అతని విష్ణుభక్తి ఏం చెయ్యగలదు?' అన్నాడు.

తరువాత రెండవ పాతాళలోకం పాలించే జయశీలుడనేవాడి కూతురు అర్ధరాత్రి వేళ సూర్యప్రభుడి కోసం వెతుక్కుంటూ వచ్చి, గాంధర్వ విధితో ఆ రాత్రి అతనికి భార్య అయింది.

మర్నాడు ప్రహ్లాదుడు సునాభుడి గౌరవార్థం విందుచేసి, బలి మొదలుగాగల రాజుల నందరినీ ఆహ్వానించాడు. ఆ సందర్భంలో ప్రహ్లాదుడి కుమార్తె మహల్లిక నృత్యం చేసింది. మహల్లికకు పన్నెండు మంది చెలికత్తె లున్నారు. ప్రహ్లాదుడి అన్నవారిని స్వర్గంనుంచి బందీలుగా తెచ్చాడట. మహల్లిక కూడా తాను పన్నెండుమంది సఖులతోసహా సూర్యప్రభుణ్ని పెళ్ళాడింది. (దానవ కన్యలందరిని "వండీ" అని పిలిచే ఆచారం ఉన్నట్టు కనబడుతుంది.)

భూవాసకవి మాటమీద అందరూ కశ్యపుడి ఆశ్రమానికి వెళ్ళారు. అక్కడ కశ్యపుడి వెంట ఆయన భార్య లైనదితీ, దానువూ వున్నారు (వీళ్ళే దైత్య దానవుల తల్లులు.)

ఆ సమయంలో కశ్యపుడు పేర్కొన్న ప్రముఖ దానవులు: శంబరుడూ, త్రిశిరుడూ, వాతాపీ, ఉలూకుడూ, కాలుడూ, వృషపర్వుడూ, ప్రబలుడూ, ప్రభుడూ, సుందోపసుందులు, హయగ్రీవుడూ, వికటాక్షుడూనూ. వీరంతా చనిపోయి మానవజన్మలెత్తి సూర్యప్రభుడిపరివారంలో ఉన్నట్టు కశ్యపుడు అన్నాడు.

దానవులు కశ్యపుడివద్ద ఉండగానే ఆయన దర్శనం చేసుకోవ టానికి ఇంద్రుడు వచ్చాడు. అతను సూర్యప్రభుణ్ని చూసి, "ఈ మనిషి విద్యాధర చక్రవర్తిత్వం కోరుతున్నాడు, ఇంద్రత్వమే ఎందుకు కోరడు?" అన్నాడు.

"నువు ఇంద్రుడివి కావాలని పరమేశ్వరుడు నిర్ణయించినట్టే ఇతను విద్యాధర చక్రవర్తి కావాలని కూడా నిర్ణయించాడు" అన్నాడు మయుడు.

"ఇతని అందం విద్యాధర చక్రవర్తిత్వానికి మించి ఉన్నది" అన్నాడు ఇంద్రుడు.

"నిజమే, శ్రుతశర్మ అందం విద్యాధర చక్రవర్తిత్వానికి తగిన దైతే ఈ కుర్రవాడి అందం ఇంద్రత్వానికి తగినదే" అన్నాడు మయుడు.

ఇంద్రుడు మండిపడి సూర్యప్రభుణ్ని చంపబోయాడు. కాని కశ్యపుడి ముఖం రౌద్రం కావటంచూసి ఆ ప్రయత్నం మానుకుని తాను విద్యాధర చక్రవర్తిగా నిర్ణయించిన శ్రుతశర్మ స్థానాన్ని కాజేయ చూస్తున్నందుకు సూర్యప్రభుణ్ణీ, అందుకు తోడ్పడుతున్న మయుణ్ణీ ఆక్షేపించాడు.

"మయుణ్ని ఎందుకు తప్పుపడతావు? అతను శివుడి ఆదేశాన్ని నెరవేర్చుతున్నాడు" అన్నాడు కశ్యపుడు.

ఈ విధంగా కథ సాగిపోతుంది. దానవశ్రేష్ఠుడైన నోముచి ఇంద్రుణ్ని అనేకమార్లు ఓడించి తరిమి కొట్టాడట. పాలసముద్రాన్ని మధించే ముందు కశ్యపుడే దేవదానవులకు సఖ్యం చేశాడట. అందులో పుట్టిన ఉచ్చైశ్శ్రవం అనే గుర్రం నోముచివంతు వచ్చిందట. దేవతలు అమృతాన్ని కాజేసేసరికి దేవదానవుల మధ్య తిరిగి ఘర్షణ సాగింది. ఆ ఘర్షణలో చనిపోయిన దానవులను ఉచ్చైశ్శ్రవం వాసనచూసి బతికిస్తూ వచ్చిందట. దానవులను ఓడించటం దేవతలకు అసాధ్యమయింది. అప్పుడు బృహస్పతి ఇంద్రుడితో, నోముచి యాచకులు ఏది అడిగినా నిరాకరించడని, ఇంద్రుడు వెళ్ళి ఉచ్చైశ్శ్రవాన్ని అడగాలనీ అన్నాడట. ఆ సలహా పాటించి ఇంద్రుడు నోముచిని అడిగి గుర్రాన్ని తీసుకుని నోముచిని హత్యచేశాడు. అలా చనిపోయిన నోముచి దానవు కడుపున

ప్రబలుడై పుట్టి, దేవతలు యజ్ఞ పశువుగా రమ్మని వేడితే ఒప్పుకొని మళ్ళీ చనిపోయి, ప్రధానుడుగా పుట్టాడట. ప్రధానుడు ఈ జన్మలో సూర్యప్రభుడికి అత్యంత సన్నిహితుడు.

ఇలాగే వంచనపొందిన మరొక దానవుడు బలి.

మొత్తంమీద ఈ కథ ఒక సంగతి స్పష్టం చేస్తుంది. దానవులు నియమబద్ధులు, దేవతలు వంచకులు, వారికి నియమాలు లేవు.

చివరకు యుద్ధం జరుగుతుంది. సూర్యప్రభుడు జయించి విద్యాధర చక్రవర్తిత్వం సంపాదిస్తాడు. అంతా అయాక దేవదానవుల మధ్య సామరస్యం ఏర్పడుతుంది.

మొత్తంమీద చూస్తే ఈ కథ మన పురాణ కథలకన్నా కొంత పాతదేమో ననిపిస్తుంది. ఇంద్రుడి రాజకీయాలు ఈనాటి అగ్రరాజ్యాలను జ్ఞాపకం చేస్తాయి.పురాణాలలో ప్రముఖులుగా చెప్పబడిన రాక్షసులు ఇందులో నామమాత్రంగానైనా ప్రస్తావించబడలేదు. భౌతిక వాదానికీ, ఆధ్యాత్మిక వాదానికీ మధ్య సంఘర్షణ జరగటం, చరిత్ర యుగాలు కూడా మనకు తెలుసు. శంకరాచార్యులవారు వేదాంతానికి ప్రాణప్రతిష్ఠ చెయ్యటమేగాక, సాంఖ్యులనూ, ఇతర నాస్తికులనూ ఖండించటానికీ, వారి సిద్ధాంతాలు పూర్వపక్షం చెయ్యటానికీ చాలా కృషిచేశాడు. ఇది దేవదానవ సంఘర్షణలనాడే ఉన్నట్టు ఒక ప్రాచీనగాథ ఉండటం చిత్రం. తొలి భౌతికవాదులు దానవులనీ, వారు సాంఖ్య, యోగాలను విశ్వసించారనీ సాక్ష్యం ఉండటం మరీ చిత్రం. "అసురా!" అనే సంబోధన ఋగ్వేదంలోనే ఒకప్పుడు గౌరవప్రదంగా ఉండేదన్నది చూస్తే, ముందు అంతా అసురులేననీ రానురాను ఆ మాట "ఆర్యులం" అని చెప్పుకునే వారికి గర్హ్యమయిందనీ, అంతా ఒక కుదిట వాళ్ళేననీ కశ్యపుడి ఉదంతాన్నిబట్టి మనం అనుకోవచ్చు.

ముందే చెప్పినట్టు శాస్త్రజ్ఞులకు ఈ కథలో ఇంకా అనేక విషయాలు కనబడవచ్చు. వారిని ఈ కథను వీలైతే సంస్కృతంలో పరిశోధించమని కోరతాను. నేను ఈ వ్యాసానికి ఆధారంగా తెలుగులోవున్న కథనే తీసుకున్నాను. తెలుగులో దైత్య, దానవ, అసుర, రాక్షస శబ్దాలు సమానార్థకాలుగా ఉపయోగించబడి ఉండవచ్చు.

## నాకు మార్క్సిస్టు దృక్పథం ఎలా అలవడింది?

ఇటువంటి ప్రశ్నకు స్పష్టమైన సమాధానం చెప్పటం దాదాపు అసాధ్యం. ఒకడు గాయకుడుగాని, కవిగాని, చిత్రకారుడుగాని, మరొక కళలో ప్రవీణుడుగాని గావటానికి వాడిలోకొంత సహజప్రతిభ ఉంటుంది. మార్క్సిస్టు కావడానికి అలాటిది కారణం అయే అవకాశంలేదు. జీవితాను భవమూ, దృక్పథమూ, పరిజ్ఞానమూ కలిసివస్తేకాని ఎవరూ మార్క్సిస్టు కాలేరు. ఇది నా విషయంలో ఏ విధంగా పనిచేసిందీ చెప్పుకోవచ్చు.

నేను తెనాలిలో పుట్టి పెరిగాను: తెనాలి పెద్దనగరం యేమీకాదు. అందుచేత నేను నగరవాసిని కాదు. అయినా నాకు పల్లెటూళ్ళలో ఆచారాలూ, అలవాట్లూ అవమానకర మనిపించేవి. నా దగ్గరబంధువులందరు పల్లెటూళ్ళలో వుండేవారు. నేను ఆ గ్రామాలకు తరచు వెళ్ళేవాణ్ని. అక్కడి సాంఘికాచారాలు, పద్ధతులు నాకు ఆశ్చర్యమూ, అసహ్యమూ కలిగించేవి.

నేను ఐదేళ్ళవాడినయి వుండగా మా పెత్తండ్రివెంట వాళ్ళగ్రామానికి కాలినడకన బయలుదేరాను. రోడ్డులేదు. పొలాలగట్లమీదుగా నడిచాం. దారిలో కొందరు మనుషులు యెదురయినప్పుడు మా పెత్తండ్రి "ఒరే:

తొలుగు!" అనేవాడు. అవతలివాడు గట్టుదిగి దూరంగా వెళ్ళేవాడు. ఇది నాకు చాలా ఘోరంగా కనుపించింది. అస్పృశ్యతను ప్రత్యక్షంగా చూడటం అదే నాకు మొదటి అనుభవం. నేను నా జీవితంలో ఎన్నడూ ఒక మనిషికి దూరంగా పోలేదు. ఇంకొకర్ని పొమ్మనలేదు.

మరికొంచెం పెద్దవాడ్ని అయ్యాక పదహారో యేట అని జ్ఞాపకం నేను మరొక పల్లెటూరిలో వుండగా ఆ ఊరికి ఒక వేశ్య వచ్చిందనీ ఆమె అధ్యాత్మరామాయణ కీర్తనలు పాడుతుందనీ తెలిసింది. నా కా పాటలు చాలా ఇష్టం. నేను పోదామనుకునేసరికి నాకు తెలిసిన వాళ్ళందరూ నిర్ఘాంతపోయి, నన్ను మందలించి, పోకుండా చేశారు. నాకు పట్టరాని కోపం వచ్చింది. వాళ్ళందరూ కూపస్థమండూకాలలాగా కనుపించారు. కాని నేను ఏమీ చేయలేకపోయాను.

ఒక చిన్న బస్తీలో పెరిగిన కారణంచేతనే నాకు పల్లెటూరి జీవితం అంధకారమయం అనిపించింది. నేను యీ పల్లెటూరి ప్రమాణాలను ఎనాడూ ఆమోదించినట్లు గుర్తురావటంలేదు. నా ఎనిమిదో యేట ఒక వేసవి మా అన్నగారివద్ద ఒక గ్రామంలో గడిపాను. ఆ గ్రామంలో మాకు ఎవరూలేరు. నేను అందరి యిల్లకూ వెళ్ళి దాహం అయితే మంచినీళ్ళు అడిగేవాడ్ని. "మా యింటిలో మంచినీళ్ళు తాగుతావా నాయనా?" అని ఆడవాళ్ళు ఆశ్చర్యపడేవాళ్ళు. మంచినీళ్ళలో మజ్జిగచుక్క వేసి యిస్తామంటే నాకు కోపం వచ్చేది. నా పద్నాల్గవయేట మా చెల్లెల్ని పల్లెటూరు ఇస్తే, పల్లెటూరివ్వటం నా కిష్టంలేక, ముహూర్తం చూడకుండా దూరంగా వెళ్ళి పడుకున్నారు.

పల్లెటూరి భౌతిక జీవితం గురించి నా కెప్పుడూ పేచీలేదు. పేదరికం అంటే అసహ్యంలేదు. నాకు ఇళ్ళకన్నా పాకంటేనే యెక్కువ యిష్టంగ ఉండేది. దారిద్ర్యం అంటేనే మంటగా వుండేది. నీరుకావిబట్టలంటే అసహ్యంలేదు. అనారోగ్యమంటేనే మంట. పల్లెటూరి బుద్ధులు అసహ్యమైనా, అక్కడి వాతావరణం బాగుండేది.

కులాలను గురించికూడా నాకు పట్టింపు వుండేదికాదు. మధ్య తరగతికి చెందిన వాళ్ళు ఏ కులంవాళ్ళయినా నాకు ఒకటిగానే ఉండే వాళ్ళు. దారిద్ర్యం ఓడుతూ కనిపించేవాళ్ళే నాకు వేరే రకంగా కనిపించే వాళ్ళు. వాళ్ళు బ్రాహ్మణులే అయినాకూడా.

ఈ మనస్తత్వం నా ఆలోచనలకూ, విశ్వాసాలకూ, రచనలకూ పునాదిగా పనికివచ్చింది.

చాలామంది దిగువ మధ్య తరగతి వాళ్ళలాగే నాకు రాజకీయా లంటే ఏవగింపు ఉండేది. కాని నా పదకొండవయేట జరిగిన సహాయ నిరాకరణోద్యమం నన్ను ఆకర్షించింది. ఆ వయసులో నాకు నిజమైన రాజకీయ చైతన్యం వుండటం అసంభవం. నన్ను ఆకర్షించినదేమంటే, మా ఊళ్ళో ఆ సమయంలో పెట్టిన జాతీయ పాఠశాలలో చేతిపనులు నేర్పేవారు. నాకు అవి చాలా బాగున్నట్లు అనిపించింది. నేనుస్కూలు మానేసి జాతీయ పాఠశాలలో జేరతానంటే అభ్యంతరం చెప్పలేదుకాని, కొన్నాళ్ళు ఆగి చూడమన్నారు. ఈ లోపల ఆ పాఠశాల మూసేశారు.

అటు తరువాత జరిగిన ఉద్యమాలు—కాంగ్రెసు ఉద్యమాలు—నాకు అవాస్తవికంగా కనబడ్డాయి. నేను హింసావాదిని కాకపోయినా బెంగాలు టెర్రరిస్టులే నిజమైన రాజకీయవాదు లనిపించింది. దానికితోడు నాసాటి వారిలో టెర్రరిస్టుల గురించి ఆక్షేపించిన వాళ్ళెవరూ లేరు. శాసనోల్లంఘనలూ, ఉప్పువండి జైళ్ళకు పోవటమూ, తాటిచెట్లు నరికి అరస్టు కావటమూ, "మేము కోర్టులను గుర్తించం" అనటం, నాకు ఫార్సుగా కనిపించింది. రాజకీయోద్యమంగా కనిపించలేదు. 'స్వరాజ్యం' అన్నందుకు జైళ్ళలో పెట్టిన బ్రిటిషు అధికారులుకూడా మూర్ఖులుగానే కనిపించారు. అంతా ఏదో ఆటలాగుంది లాఠీచార్జీలు, తలలు బద్దలు కావటం తప్ప.

నేను హేతువాదిని కావటానికి కారణం చిన్నతనంలోనే తండ్రీ,

తల్లీ పోవటం కావచ్చు. సాధారణంగా గుడ్డినమ్మకాలు సన్నిహితుల నించి సంక్రమిస్తాయి. దూరస్థులు చెప్పేమాటలు అంత తేలికగా జీర్ణించుకోపోవచ్చు. ఏమైనా సైన్సు విద్యార్థిని కావటంలో నాలో వుండిన హేతువాదానికి బలం వచ్చింది. నాకున్న శాస్త్రజ్ఞానం అంతా కలిపి మిల్లిగం బెడుకూడా వుండదు. కాని శాస్త్రీయ దృక్పథం నాకుచాలా మేలు చేసింది. సంఘ సంస్కరణ విషయంలో వీరేశలింగంగారి వాదాలు గాని, వ్యావహారిక భాషా విషయంలో గిడుగు రామమూర్తిగారి వాదాలు గాని సరయినవని గ్రహించటానికి, ఆమోదించటానికి నాకు యే మాత్రమూ సంకోచం కలుగలేదు.

ఎవరు ఏమనుకుంటారోనని నాకు తప్పుగా తోచిన పనులు చెయ్యవలసిన పరిస్థితి నాకు లేకపోయింది. నేను అంతవరకు స్వతంత్రుణ్నే. అనేక విషయాల్లో నేను తిరుగుబాటుచేశాను. అందులో నేను పెద్ద సాహసంకూడా ప్రదర్శించలేదు. మా బంధువుల్లో ఒకామె వితంతు వివాహం చేసికొన్నది. ఆమె తల్లి ఆమెను రప్పించి పగలల్లా బయటి పాకలో వుంచి పగలు అక్కడే అన్నంపెట్టేది. ఇటువంటి మూఢత్వం పట్ల నాకు అసహనం జాస్తి. నేను ఆమెను మా యింటికి పిలిచి, నా ప్రక్కనే భోజనంపెట్టి పంపాను. నన్ను యెవరూ హత్యచేయలేదని రూఢిచేసి ఆమెను తల్లి ఇంట్లోకి చేర్చింది.

అలాగే జంధ్యం తీసిపారేసి తద్దినాలు పెట్టడం మానేసినప్పుడు నన్నెవరూ హత్యచెయ్యలేదు. మనం ఏవో జీవిత విధానాలమధ్య పుట్టి పెరుగుతాం. అది తప్పదు. కాని ఆ విధానాలు నిరర్థకమని తెలిసినాక వాటిని విసర్జించకపోవటం ఆత్మద్రోహమని నాకు మొదటినుంచీ నమ్మకం.

నాకు ఆవేశాలు చాలా తక్కువ. ఆవేశాలకు తేలికగా గురి అయే వాడు బుద్ధిని పదునుగావుంచుకోలేడు. ఆవేశంలేనిదే మతపిచ్చి కలుగదు. నాకు మతోన్మాదులపట్ల సానుభూతి లేదు. కమ్యూనిస్టుపార్టీ అవతరించి

Acc NO 11888



నప్పుడు కమ్యూనిస్టులలోనూ, కమ్యూనిస్టు వ్యతిరేకులలోనూ కూడా నాకు ఆవేశం వచ్చేదికాదు. వాస్తవ పరిస్థితులను పరిగణించకుండా సిద్ధాంతాలు ఏకరువుపెట్టేవాళ్ళు ఒకరకం పిచ్చివాళ్ళలాగే కనిపించే వాళ్ళు.

తెనాలిలో నెలకు 250 రూపాయలనష్టంమీద నడిచే ఒక ప్రెస్‌లో కమ్యూనిస్టులు సమ్మె తెచ్చిపెట్టారు. ప్రెస్‌వాళ్ళ తప్పు లేకపోలేదు. రోజుకు ఆరుగంటల్లేని ఆ ప్రెస్‌లో పనివాడు పదినిమిషాలు ఆలస్యంగా వస్తే ఒక గంట జీతం విరగకోస్తామనీ, ఒకపూట రాకపోతే రోజల్లా రానట్లు పరిగణిస్తామనీ చెత్తరూలు పెట్టారు. దొందూ దొందే!

నిజానికి 1942లో మార్క్సు రాసిన 'కాపిటల్' చదివినదాకా నాకు నాకు కమ్యూనిజమునకుఆధారమేమిటో తెలియదు.అంతదాకా నా దృష్టిలో కమ్యూనిజం అంటే ఒక వేలంవెర్రి మాత్రమే. నాకు కమ్యూనిస్టులను గురించి తెలుసుకోవాలని కోరిక కల్గటానికి కారణం, ఎవరో మిత్రుడు మాటల సందర్భంలో "చూడగా కమ్యూనిస్టుల పద్ధతే సరిగా వున్నట్లు కనిపిస్తుంది" అన్నాడు నిర్వికారంగా. అతను బుద్ధి ఉపయోగించి చెప్పిన యీ మాట నామీద బండెడు ప్రచారంకన్న యెక్కువగా పనిచేసింది. దొరికిన మార్క్సిస్టు సాహిత్యం చదివాను. 'పీపుల్స్‌వార్' చదివేవాణ్ణి. భవిష్యత్తు మార్క్సిజంకే ఉన్నట్లు నాకు నమ్మకం కుదిరింది.

నాలో యీ మార్పు చూసి కొందరు మిత్రులు 'ఈ కమ్యూనిస్టు లను నువు యెరగవు. వాళ్ళు వట్టి లఫంగులు' అన్నారు.

'వీళ్ళు మంచివాళ్ళు కాకపోతే మంచివాళ్ళు వస్తారు. కమ్యూనిజం సరి అయినదే' అని సమాధానం చెప్పాను.

ఈ రకం వాదం నాకు చాలా కాలంగా తెలుసు. అందులో ఉన్న తిరుగుడు ఏమిటంటే, నువు సమర్థించదలచినప్పుడు సిద్ధాంతాన్నిపొగడు. తిట్టదలుచుకున్నప్పుడు వ్యక్తులను తిట్టు! చాలా తేలికపద్ధతి. చాలామంది మీద పనిచేస్తుందికూడా! కాంగ్రెసులో లఫంగులు లేరా? వాళ్ళనుబట్టి

కాంగ్రెసు సిద్ధాంతాలను తిడితే వూరుకుంటారా? కాంగ్రెసులో లఫంగులను గురించి నేను ఒక కథ వ్రాస్తే 'భారతి' పత్రిక త్రిప్పి పంపింది. దాన్ని శ్రీ పాదసుబ్రహ్మణ్యశాస్త్రిగారు తమ 'ప్రబుద్ధాంధ్ర'లో వేసుకొన్నారు. ఇది 1935 నాటి మాట. అప్పటికి తెనాలిలో కమ్యూనిస్టు లున్నట్లుకూడా నాకు తెలియదు.

నేను వాతావరణాన్నిబట్టి కమ్యూనిస్టు అభిమానినికాలేదు. కమ్యూనిజమునకే భవిష్యత్తు ఉన్నట్లు నేను నిశ్చయించుకున్న సమయంలో నా చుట్టుప్రక్కల కమ్యూనిస్టు అభిమానులుగాని, కమ్యూనిస్టులుగాని లేరు. నేనప్పుడు ఎక్కడో సిమ్లాలో ఉంటున్నాను, యుద్ధ ప్రచారంచేసే సంస్థలో. వాతావరణ ప్రభావంతో కొన్ని విశ్వాసాలకు లోనయినవాళ్ళు వాతావరణం మారగానే తామూ మారిపోతారు. కాని కేవలం హేతు బుద్ధితో విశ్వాసం కలిగించుకున్న నాబోటి వాడికి పైనుంచి కొంత మోరల్ సపోర్టు రావటం చాలా బలాన్ని యిస్తుంది. అలాటి బలాన్ని నాకు యిచ్చినవాళ్ళు శాస్త్రవేత్తలు జె. బి. యస్. హాల్డేన్, అనటోల్ ఫ్రాన్సులు. వాళ్ళిద్దరూ కమ్యూనిస్టులయ్యారని తెలిసి, నేను ఎంత గొప్ప దారిలో నడుస్తున్నాను అనుకున్నాను.

సామాన్య ప్రజలకు శాస్త్రజ్ఞానం అందించటంలో నాకు హాల్డేన్ పద్ధతి అత్యుత్తమంగా కనిపించింది. (నాకు కొంచెం చిరాకు కల్గించినది ప్రొఫెసర్ జీన్సు పద్ధతి). ఫ్రాన్సు విషయం చెప్పనే అక్కర్లేదు. ఆయనను మించిన మేధావి రచయితలలో ఉండడు అనుకునేవాణ్ణి. ఆయన కూడా చివరిరోజులలో కమ్యూనిస్టు అయి జాక్ లండన్ రచించిన 'ఐరన్ హీల్'కు గొప్ప పీఠిక రాశాడు.

నేను రచనలు చెయ్యటం మొదలుపెట్టినప్పట్నించీ ఏదో ఒక సాహిత్యోద్యమంవెంట ఉంటూనే వస్తున్నాను. నవ్యసాహిత్య పరిషత్తులో సభ్యుణ్ణి. కాని 1941 ఆరంభంలో మద్రాసులో జరిగిన నవ్యసాహిత్య పరిషత్సమావేశములో నాకు దానిమీద కొంత అసంతృప్తి యేర్పడింది.

అటుతరువాత నేను దూరప్రాంతాలకు వెళ్ళాను. ఆ సమయంలో 'అభ్యుదయ రచయితల సంఘం'ఏర్పడింది.నన్ను అందులో చేరమంటే"అభ్యుదయ రచయిత" ను అని ప్రకటించుకోవటం రొమ్ము విరుచుకోవటంగా కనిపించి, "రచయిత అంటే నా దృష్టిలో అభ్యుదయ రచయితే. అలాటి బిరుదు నేను తగిలించుకోను" అనేశాను. కాని అది ఒక ఉద్యమమనీ, గురజాడ, కందుకూరి మొదలయిన నా అభిమాన రచయితలకు ప్రచారం చేస్తున్నదనీ తెలియగానే నేనుకూడా అందులో సభ్యురాలయి నాకున్న పరిమితశక్తిని ఆ ఉద్యమానికి అంకితంచేశాను.

అభ్యుదయ సాహిత్యోద్యమం విఫలం కాలేదు. తరవాత వచ్చిన మంచి సాహిత్యానికి అది గట్టిపునాది వేసింది. దాని మూలసూత్రాలు పురోగామి సాహిత్యానికి మంచి ఆధారమయ్యాయి. కాని అనేక కారణాలవల్ల ఆ ఉద్యమం చప్పబడిపోయింది. ముఖ్యంగా తెలంగాణా పోరాటమూ, కమ్యూనిస్టులవేటా జరిగినప్పుడు వాటి ప్రభావం సాహిత్యరంగంలోకూడా కనబడింది. ఉడుకురక్తం ఉద్రేకించింది. నాబోటి రచయితలు కొందరు తిరోగాములుగా విమర్శించబడ్డారు.

నిజానికి అభ్యుదయోద్యమం విప్లవానికి దోహదకారికాదు. విప్లవ సాహిత్యానికి ఒరవడి నిర్దేశించినది మార్క్సు-ఎంగెల్సు కారు. లెనిన్, మార్క్సు అభిమాన రచయితలు షేక్స్పియర్, గోధే, బాల్జాక్ మొదలయినవారు. ఎంగెల్సు మంచి సాహిత్యానికి బూర్జువాలక్షణాలు...సందేశం నిగూఢంగా వుండటం వగయిరా...వుండా లన్నాడు. ప్రజా జీవితంలో రచయిత నిమగ్నుడు కావాలన్నవాడు లెనిన్. అటు తరువాత మావో-ప్రజా సామాన్యాన్నిగురించి వ్రాయాలనీ, ప్రజాసాహిత్యం కావాలనీ అన్నవారున్నారు గాని, అలా రాసేవారు ఉద్యమంలో చాలా కొద్దిమంది ఉండేవారు. ఆ దశలో విప్లవ సాహిత్యోద్యమం వచ్చే అవకాశాలుకూడా చాలా తక్కువగానే వుండే వనుకుంటాను. మొత్తంమీద మధ్యతరగతి మనస్తత్వం అభ్యుదయ సాహిత్యానికి చాలాబలంగాఅంటిపెట్టుకొనివుండింది.

తెలంగాణా పోరాటం అంతమైన తర్వాత అభ్యుదయ రచయితల సంఘం గుంటపూలు పూయ నారంభించింది. అభ్యుదయ రచయితలు నిజంగానే తిరోగమించ నారంభించారు.

నా ఉద్దేశ్యంలో సాహిత్యోద్యమాలు జీవిత సత్యాలను వదిలేపి, సిద్ధాంత సూత్రాలకు ప్రాధాన్యం యిచ్చినప్పుడు మంచి సాహిత్యం రాలేదు. తాత్కాలికంగా గొప్పసాహిత్యం అని పేరుతెచ్చుకున్నా ఎక్కువ ప్రయోజనం కాలేదు.

విప్లవ సాహిత్యోద్యమం సరిఅయిన తరుణంలోనే వచ్చింది. దేశంలో ఒక పాలకవర్గం సుస్థిరంగా యేర్పడింది. కాలు శతాబ్దంపాటు పరిపాలన ప్రజాజీవితాన్ని ఊబిల్లోకి లాగటమేగాక అది స్వయంగా నైతికపతనం పొందింది. దాని వాగ్దానాలకు విలువలేదు. అది చెప్పేమాటలలో మెడమీద తల ఉన్నవాడి కెవడికీ నమ్మకములేదు. ప్రజా సమస్యలను పరిష్కరించేశక్తి దానికిలేదని రుజువయింది. దాని ఏలుబడిలో దేశం సామ్రాజ్యవాదులకు తాకట్టుపడిపోతున్నది. అన్నిరంగాలలోనూ అశాంతీ, ఆందోళనా, తిరుగుబాటూ కనిపిస్తున్నాయి. పాలకవర్గం ప్రజలను హత్యచెయ్యకుండా ఒక్కరోజు వెళ్ళబుచ్చలేని హీనస్థితికి దిగజారింది. ఈ ప్రభుత్వం బెదురుకు పరాకాష్ఠ రచయితలను నిర్బంధించడం, వేలాది యువకులను నిరారోపణగా, నిర్విచారంగా ఏళ్ళతరబడి ఖైదుల్లోవుంచి, చిత్రహింసలు చెయ్యటం. ఇది తుమ్మితే ఊడే ముక్కు!

ఇలాంటి పరిస్థితుల్లో విప్లవసాహిత్యోద్యమంరాకపోతే రచయితలు షండులన్నమాట! పాలకవర్గీయులకు భజనచేసే రచయితలు, ఎంగిలిమెతుకులకు తోకలాడించే కుక్కలకన్నా ఎక్కువవాళ్ళుకారు. సోషలిజం వ్యష్టివాదంకాదు. సమిష్టివాదం. సోషలిజం అంటూ స్వార్థంచూసుకునేవాడు సంఘద్రోహి. రచయితలు సంఘద్రోహులు కారాదు. అందుచేతనే విప్లవ సాహిత్యోద్యమం యీనాటి ప్రధానావసరం. దేశంలో చైతన్యవంతులైన యువకులకు అది ఉత్తేజం కల్గిస్తుంది.

మరొకటికూడా నాకు అనిపిస్తుంది. దేశంలో కృతకరాజకీయ చైతన్యం నానాటికీ యెక్కువవుతున్నది. ప్రతి చెత్త సమస్యకూ ఒక రాజకీయోద్యమ స్వరూపం వస్తున్నది. దీన్ని అరికట్టడానికయినా విప్లవ సాహిత్యం అవసరం. ప్రజాబాహుళ్యానికి సంబంధించని సమస్యలమీద సాగేఉద్యమాలేవీ నిజమైనరాజకీయోద్యమాలుకావు.రామాయణాన్నితగుల బెట్టడమో, హిందీ భాషను ప్రతిఘటించడమో, కన్నడభాషలో మంచి రచయితలు లేరనటమో పెద్దరాజకీయాలు కావటం అర్థంలేనిది. ఈ పరిస్థితిని విప్లవ సాహిత్యం కొంతవరకు సరిచేయవచ్చునని తోస్తుంది. అట్టడుగు ప్రజల జీవితాన్ని వాస్తవంగా చిత్రించినకొద్దీ పదవుల కీచులాట రాజకీయాలూ ఎంత హేయమైనవో తెలుస్తుంది. అలా తెలియటం విప్లవ పరిస్థితిని బలపరచటానికి యెంతగానో తోడ్పడుతుంది.

చిట్టచివరగా ఒకమాట చెప్పాలి. రచయితలందరూ అంతో యింతో మార్క్సిజం తెలిసినవారై ఉండటం అవసరం. మార్క్సిజం ఒక శాస్త్రం. దాన్ని అవగాహన చేసుకునేటందుకు శాస్త్రీయ దృక్పథం కావాలి. మేధావు లనిపించుకునే రచయితలుకూడా, "మార్క్సు చెప్పినదంతా తప్పేనటగా!" అనటం వింటాం. ఇది శాస్త్రీయ దృక్పథం లేకపోవటానికి నిదర్శనం.

మతవిశ్వాసాలలాగా శాస్త్రీయ ప్రతిపాదనలు మార్పులేనివికావు. శాస్త్రవిజ్ఞాన చరిత్ర యెరిగినవా రందరికీ యీ విషయం తెలుసు. ఫ్లాజిస్టాన్ సిద్ధాంతమూ, ఈథర్ సిద్ధాంతాలూ లాంటి అర్థంలేని సిద్ధాంతాలను శాస్త్రజ్ఞులు చాలాకాలం ఉపయోగించుకున్నారు. వాటి అవసరం తీరిపోగానే వదిలేశారు. ఏ సిద్ధాంతమైనా అనుభవంతోటీ, పరిస్థితులలో ఏర్పడే పరిణామాలతోటీ సంస్కరించబడుతుంది. ఇది తప్ప జ్ఞానం పురోగమించే మార్గం మరొకటిలేదు. మార్క్సిజం జడవాదం కాదు. దాన్ని లెనిన్, స్టాలిన్,మావోలు ఆయాపరిస్థితులకు అనుగుణంగా సంస్క

రిస్తూ వచ్చారు. ఐన్‌స్టయిన్ సాపేక్ష సిద్ధాంతం రాగానే న్యూటన్ ప్రతిపాదించిన 'గతిసూత్రాలు' అబద్ధం అయిపోలేదు. న్యూటన్ సూత్రాలు కొన్ని పరిధులలో సరిఅయినవే, వాటిని ఐన్‌స్టయిన్ విస్తరించాడు.

శాస్త్రజ్ఞుల దృష్టిలో-మార్క్సిస్టుల దృష్టిలోకూడా - పరమసత్యాలంటూ లేవు. అనుభవాన్ని విశ్లేషించి సిద్ధాంతాలు చెయ్యటమూ, ఆ సిద్ధాంతాలను అధిగమించి అనుభవం పోయినప్పుడు పాతసిద్ధాంతాలను సంస్కరించటమూ వారి పని. చంటిబిడ్డలకు పాలుతప్ప వేరే ఆహారం అవసరం వుండదు. కొన్నినెలల అనంతరం ఆ పాలమీదనే బిడ్డ పెరగలేడు. ఇతర ఆహారాలు కావాలి. జ్ఞానంకూడా పరిణామం చెందుతుంది. ఇదే మార్క్సిజంకుకూడా వర్తిస్తుందని తెలియనివాళ్ళు మార్క్సిజమును ఆక్షేపిస్తారు. రచయితలు ఇలాంటి ఆక్షేపణలకు సమాధానం చెప్పగలిగి వుండాలి. ముఖ్యంగా విప్లవ రచయితలు మార్క్సిజం తప్ప తమను ముందుకు నడిపించేది మరేదీలేదని గుర్తించాలి.

BCi

AOUAC05B126

BC

## సమత ప్రచురణలో

## శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

## హేతువాద సాహిత్యం

1) బ్రాహ్మణులు
2) "మాయదారి దేవుడు"
3) వేదాలలో ఏమున్నది?
4) ఓ అనార్య గాథ
5) హేతువాదం – భౌతికవాదం
6) ఆటవిక సమాజంలో ఆడది
7) వేదకాలపు దేవతలలో మాత్స్యులు
8) మూఢాచారాలు – భౌతికవాదం
9) మనిషి – దేవుడు
10) రంగనాయకమ్మ విషవృక్షం

ఒక హేతువాద పరిశీలన.

"సమత" కి రు **5**/– చందా పంపినవారికి శ్రీ కొడవటిగంటి కుటుంబరావు సమగ్ర హేతువాద సాహిత్యమూ, సమత ప్రచురణలనుండి మీరు ఏరి కోరుకునే ఒక హేతువాద గ్రంథమూ అందజేయబడతాయి.

హేతువాదులందరూ యీ అవకాశాన్ని వినియోగించుకుని, మాకు తోడ్పడతారని ఆశిస్తున్నాం.

మీ

— సమత.

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R. NARLA D.P.R.I. Acc. No. 11850

## సుదమ ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | AOUA105B126 |
| పుస్తకం పేరు | ఒక ఆచార్యగాథ |
| తారీఖు | 31 December 2025 |
| ముందు అట్ట | yes |
| వెనుక అట్ట | yes |
| మొత్తం పేజీలు | 29 |
| పెద్ద సైజు పేజీలు | no |
| ఖాళీ పేజీలు | BCi |
| లేని పేజీలు | 1, 2 |
| తయారు చేసినది | kethu |
| పేజీలు విడదీసినది | kethu |
| స్కాన్ చేసినది | Teja |
| పరీక్ష చేసినది | anusha |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | good |